## ఆచారములు - అంతరార్థములు



ప్రక్కనున్న చిత్రమును గురించి మీరేమనుకుంటున్నారు? భారతదేశములో ప్రజలు కొంతమంది మావటివానికి కొంత ధనమిచ్చి, ఏనుగు ఆశీర్వచనములు పొందుతుంటారు. కారణం తెలుసా? మరి చదవండి. ఈ ప్రపంచములో ప్రతివ్యక్తి అతనికే పరిమితమైన వ్యక్తిత్వము కలిగి ఉంటాడు. నాకు పుస్తకములు చదవడమంటే ఇష్టం. కాని నా స్నేహితులకు సినిమాలు చూడడమంటే ఇష్టం. కొంతమందికి పాత సినిమాలు ఇష్టం. కొంతమందికి వారికిష్టమైన కథానాయకుడి సినిమాలనే చూసేందుకు ఇష్టం. ఇదివరకు సంఘమిత్రలో ప్రస్తావించినట్లు, పది మంది ఒకే దృశ్యాన్ని చూసినా - వారిలో ఒక్కొక్కరికి ఒక్కొక్క రకమైన అనుభూతికి లోనవుతారు. అదేవిధముగా దైవాన్ని కొలిచే పద్ధతిలో - ఒక్కొక్కరికి ఒక్కొక్క రకమైన వస్తువో, చాయాచిత్రమో అంటిపెట్టుకోడానికి ఉంటుంది. చాలా సందర్భములలో మనము ఎదుటి వ్యక్తి ఎంచుకున్న విగ్రహమును గాని, చిత్రమును గాని ఆమోదించము. సరిగ్గా ఇక్కడే వాగ్యుద్ధముగాని, ద్వంద్వ యుద్ధముగాని మొదలవుతుంది. ప్రతివారూ వారికి ఇష్టమైన దైవాన్ని కొలుచుకోవడములో అసలు సమస్య లేదు. కాని, ఎదుటివ్యక్తి నమ్మకాన్ని ఖండిస్తే మాత్రమూ అది ఘర్షణకి దారి తీస్తుంది. అందరికీ తెలిసిన విషయమే - భారతదేశము అంటే ముక్కోటి దేవతలూ గుర్తుకు వస్తారు. రాముడనండి, కృష్ణుడనండి, శివుడనండి, విష్ణువనండి. ఒక్కొక్క పేరు ఒక్కొక్క గుణమును బట్టి వచ్చింది. ప్రతి రూపమునకు ఒక అంతరార్థముంది. విద్యను ఆశించేవారు సరస్వతీదేవిని ఆశ్రయిస్తే, ధైర్యమును కావాలని తపన పడేవారు హనుమంతుని ఆశ్రయిస్తారు. కావున ఒక్కొక్కరూపమునకు ఒక్కొక్క విశేషమున్నది. నిర్గుణాకారమైన శక్తిని ధ్యానించాలంటే చాలా కష్టము. ధ్యానించడానికి ప్రారంభదశలో ఏదో ఒక రూపము కావాలి. ఒకసారి ధ్యానములో నిమగ్నమయితే ఆ రూపము అదే మాయమైపోతుంది. చిన్నపిల్లలు నడవడం నేర్చుకునే దశలో పట్టుకోడానికి ఒక ఆధారం కావాలి. కాని, ఏమీ పట్టుకోకుండానే నడవగలమని వారికి నమ్మకం కుదిరితే, ఇక ఆధారముగురించి పట్టించుకోరు. ఆధ్యాత్మికతలో కూడా అంతే!

తిరుమల వెళ్ళే తోవలో ప్రతిమెట్టుకు పసుపురాసి, కుంకుమ బొట్టు పెట్టే వాళ్ళను చూసి మీరెప్పుడైనా ఆశ్చర్యపోయారా? వారు కోరుకున్నది జరగాలని దేవుని ప్రార్థించి, అది జరిగిన తరువాత దేవునికి కృతజ్ఞతలు తెలుపుతూ అలా చేస్తారు. నిజానికి ఈ విశ్వాన్ని నియంత్రించే శక్తి, దేవుడను లేదా వేరే ఏదైనా పేరుతో పిలిచినా సరే, అన్ని జీవులలోను, నిర్జీవులలోను నిండి ఉంది. అందువల్ల అన్ని జీవులు, నిర్జీవులు కూడా పూజార్హమైనవే. అదే విధముగా ఏనుగు కూడా! మీరనవచ్చు "మావటి ఏనుగుమీద కూర్చుంటాడు కదా! అది తప్పు కాదా?" అని. ప్రతిజీవి మరియు నిర్జీవి దాని పని అది చేసుకుపోతోంది. అందుకే మనము చేతులు జోడించి నమస్కారముతో ఒకరినొకరం అభినందించుకొంటాం. అయితే అది మన ఎదురుగానున్న వ్యక్తిని నమస్కరించడమే కాదు, వారిలోని దైవత్వానికి నమస్కరించడమన్నమాట. ఒక కవి అన్నట్లు "ఈ విశ్వములో గౌరవించడానికి అనర్హమైనది ఏదీ లేదు." కావున మనము అందరినీ గౌరవిస్తూ, శాంతిని అనుభవించెదముగాక!

మళ్ళీ అక్టోబరు సంచికలో కలుద్దాం! - **సుశ్రీ.**